RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 03 పేజీలు - 05 వెల - 04/- బుధవారం 25 సెప్టెంబర్ 2024

# బడుగులకు పెద్దపీట

## నామినేటెడ్ పోస్టుల భర్తీ..

### 20 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవాళ మొత్తం 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. అలాగే ఒక కార్పొరేషన్‌కు వైస్ ఛైర్మన్, వివిధ కార్పొరేషన్లకు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జనసేన నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరికి అవకాశం దక్కింది. ఇక ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడిని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్‌ను ప్రభుత్వం నియమించింది.

3లో

- జనసేనకు 3, బీజేపీకి ఒక పోస్టు కేటాయింపు
- ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్
- శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడు 20 సూత్రాల కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్

# తిరుమల లడ్డూ వ్యవహారంపై సిట్ ఏర్పాటు



**సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియామకం**

**ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం**

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్24::వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిన నెయ్యిని వాడిన వివాదం ఏపీలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంలో నిజానిజాలు తేలాలంటూ హిందూ ధార్మిక సంస్థలు, సామాన్యుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తిరుమల లడ్డూ వ్యవహారంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించింది. ఈ మేరకు నేడు ఉత్తర్వులు జారీ చేసింది.ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉండనున్నారు. వీరితో పాటు మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉండనున్నారని ప్రభుత్వం వివరించింది.కాగా లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై సిట్ వేస్తామని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇదివరకే సంకేతాలు ఇచ్చారు. సిట్ చీఫ్ ఎంపికపై కసరత్తు పూర్తవడంతో ప్రభుత్వం ఇవాళ ఈ ప్రకటన చేసింది.

# ఏపీ మహిళా కమిషన్ ఛైర్మన్ కు ప్రభుత్వం ఉద్వాసన.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 24: ఏపీ మహిళా కమిషన్ ఛైర్మన్ గజ్జెల లక్ష్మికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆమె పదవి కాలం ఆగస్టులోనే ముగియడంతో వెంటనే తొలగించాలని ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

ఈ మేరకు మంగళవారం నాడు సంబంధిత శాఖకు ఆదేశాలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఈరోజు ఉదయం గజ్జెల లక్ష్మి ప్రకటించారు. ఆమెకు నిన్ననే ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఛైర్మన్‌కు ఉద్వాసన పలకడంతో సభ్యుల పదవి కాలం పూర్తి అయినట్టే అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# సనాతన ధర్మంపై మాట్లాడితే సహించం

- లడ్డూ అపవిత్రంతో మనసులు గాయపడ్డాయి
- సెక్యులరిజం అంటే వన్‌వే కాదు..టూ వే
- పొన్నవోలు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి
- ప్రకాశ్ రాజ్ నీతులు చెప్పడం మానండి
- ధర్మారెడ్డి ఎక్కడ గయబ్ అయ్యారో తెలీదు
- ధర్మానికి అపసచారం జరిగినప్పుడు హిందువులు గొంతెత్తాలి
- విజయవాడ కనకదుర్గమ్మ పాదాల చెంత..పవన్ కళ్యాణ్ ఆవేదన

4లో



## కల్తీ జరిగినట్టు నిరూపిస్తే పవన్ బూట్లు తుడుస్తా

### డిప్యూటీ సీఎం పవన్‌కు మాజీ మంత్రి అంబటి రాంబాబు సవాలు



2లో

## ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం



2లో

# ఒకే చట్టం పరిధిలోకి యూనివర్సిటీలు

- విశ్వవిద్యాలయాలన్నీ ఒకే చట్టం కిందకు
- కరికులం మార్పునకు నిపుణులతో ప్రత్యేక కమిటీ
- పీపీపీ విధానంలో కృత్రిమ మేధ విశ్వవిద్యాలయం ఏర్పాటు
- వర్సిటీల ర్యాంకింగ్ మెరుగుదలకు ఐదేళ్ల ప్రణాళిక
- ఉన్నత విద్య సమీక్షలో సీఎం



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్24: ఇకపై ఒకే చట్టం పరిధిలోకి అన్ని యూనివర్సిటీలను తీసుకురానున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఉన్నత విద్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ప్రభుత్వ వర్సిటీల బలోపేతం, పోస్టుల భర్తీ, ప్రమాణాల పెంపు అంశంపై అధికారులతో చర్చించారు. "బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఛైర్‌పర్సన్స్‌గా పారిశ్రామికవేత్తలను నియమించే ప్రతిపాదనలు చేస్తున్నాం. పీపీపీ విధానంలో ఏఐ వర్సిటీ ఏర్పాటు చేస్తాం. రాజధాని నవనగరాల్లో భాగంగా అమరావతిలో స్పోర్ట్స్ విలేజ్ నిర్మిస్తాం.వచ్చే ఏడాది నుంచి కరికులమ్ మార్పునకు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకతతో వీసీలను నియమిస్తాం. విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌కు ఐదేళ్ల ప్రణాళిక రూపొందిస్తున్నాం"అని తెలిపారు.

# వైసీపీకి బిగ్ షాక్..

## రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్24: వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. రాజ్యసభ సభ్యత్వానికి వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అందజేయగా,రాజీనామాను ఆమోదిస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ మంగళవారం ప్రకటించారు. ఆర్ కృష్ణయ్య స్థానం ఖాళీ అయిందంటూ రాజ్యసభ సెక్రటరీ బులిటెన్ విడుదల చేశారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడం గమనార్హం. ఇటీవలే వైసీపీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో గతంలో 11 మంది వైసీపీ తరఫున ఎంపీలు ఉండగా.. మొత్తం ముగ్గురు రాజీనామాలు చేశారు. ముగ్గురు రాజీనామా చేయడంతో వైసీపీ రాజ్యసభ ఎంపీల సంఖ్య 8కి పడిపోయింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# 30 వ తేదీ వరకు హజ్ యాత్ర కు దరఖాస్తు గడువు పొడిగింపు.!

-మరోసారి గడువును పొడిగించిన కేంద్రహజ్ కమిటీ.

-గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు రూ.లక్ష ప్రభుత్వ ఆర్థిక సాయం.

-ఏపీ మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబరు 24:
హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025 కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువు ను మరోసారిపొడిగించినట్లు రాష్ట్రమైనార్టీసంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హజ్ దరఖాస్తుల ఫారమ్‌లను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ మొదట ఆగస్టు 13వ తేదీ నుంచి ప్రారంభించి చివరి తేదీ సెప్టెంబర్ 9వ తేదీ వరకు నిర్ణయించిందని, ఈ గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు.అయితే దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు మరోసారి కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం కోసం కేంద్రహజ్ కమిటీ దేశవ్యాప్త ప్రకటన చేయడం జరిగిందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లేందుకు ఇప్పటివరకు 1937 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.ఇందులో 1589 దరఖాస్తులు అన్ని అంశాలతో కరెక్ట్ గా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్ కి వెళ్లే రాష్ట్ర ప్రయాణికులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.రాష్ట్రంలో రూ.105 కోట్లతో మైనారిటీ యూత్ ఎంపవర్మెంట్ కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సిలెన్స్, రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, రూ 105 కోట్లతో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సిలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మైనారిటీ యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ఒక్కొక్క కేంద్రాన్ని రూ. 35 కోట్లతో మైనారిటీ జనాభా ఎక్కువ గల గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లా కేంద్రాలలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా ఏ.ఐ మరియు డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న అధునాతన కోర్సులలో మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడం ద్వారా మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు, స్వయం సమృద్ధి తో పరిశ్రమలు,వ్యాపార సంస్థలు, సాఫ్టువేర్ తదితర రంగాలలో అడుగుపెట్టి నిలదొక్కుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దోహదపడుతుందని మంత్రి ఫరూక్ అన్నారు.

# సీఎం చంద్రబాబు కు ధన్యవాదాలు తెలిపిన ఫరూక్ షిబ్లీ .!



ఆంధ్రప్రగతి అమరావతి సెప్టెంబర్ 24: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ మాట్లాడుతూ మైనార్టీల హామీలను త్వరగా అమలుకై వేగంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు అలాగే పెద్దలు మైనారిటీ & న్యాయ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. నిన్న సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మైనార్టీల సమీక్ష సమావేశంలో ఇమామ్, మౌజ్జన్ గౌరవ వేతనం క్రింద 10వేలు, 5వేలు, అలాగే మసీదుల నిర్వహణ కొరకు 5వేలు, హజ్ యాత్రకు వెళ్లే వారికి లక్ష రూపాయల సహాయం ఇచ్చే కార్యక్రమాలను త్వరగా అమల్లోకి తేవాలని, టిడిపి ప్రభుత్వంలో మంజూరైన కొంతమేర నిర్మాణాలు జరిగిన కడప హజ్ షాదిఖానాలు ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని, మైనార్టీలకు లబ్ది జరిగేలా వక్ఫ్ భూముల అభివృద్ధి కొరకు 2సం॥లలో వక్ఫ్ భూములు సర్వే పూర్తి కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు గారు ఆదేశించడం మైనార్టీలకు సీఎం తీపి కబురు ఇవ్వటమేనని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షిబ్లీ అన్నారు. అలాగే వక్ఫ్ బోర్డు అభివృద్ధిలో ఆ వర్గానికి చెందిన వారే భాగస్వాములుగా ఉండేలా చూడాలని ప్రభుత్వ శాఖలు మత కార్యక్రమాల్లో అనవసర జోక్యం చేసుకోకుండా పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించడం హర్షణీయం అని అన్నారు.అలాగే గత ప్రభుత్వ హయంలో హజ్ యాత్రకు వెళ్లిన వారికి రావలసిన సబ్సిడీ అమౌంట్ కూడా త్వరగా పెద్ద మనస్సు చేసుకొని విడుదల చెయ్యాలని సీఎం గారికి విజ్ఞప్తి చేశారు.

# సీఎం చంద్రబాబు కుచెక్కులు అందజేసిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 24: నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు అందించిన 26,88,616 రూపాయల విలువగల చెక్కులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అందజేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలియజేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం వారిని ఆదుకోవాలని పిలుపునివ్వడంతో నంద్యాల ప్రజలు ముందుకొచ్చి వారి వంతు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేయడం జరిగిందని ఆ చెక్కులను విడతల వారీగా అందిస్తున్న దానిలో భాగంగా మూడో విడతలో సీఎం చంద్రబాబు నాయుడుకు 26,88,616 రూపాయల విలువ గల చెక్కులను ఇవ్వడం జరిగిందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలియజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ముందుకొచ్చిన వారందరికీ మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇంకా ప్రజలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

# మైనారిటీల సంక్షేమం కోసం బృహత్ ప్రణాళిక.!



-న్యాయశాఖ లో మరింత పటిష్టతకు కార్యాచరణ.

-ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 24:
రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం కోసం బృహత్ ప్రణాళిక అమలు దిశగా చర్యలు చేపట్టాలని, న్యాయశాఖలో మరింత పటిష్టతకు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరాల జల్లులు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైకో జగన్ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం అయ్యాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలంతా మెచ్చుకునే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన మైనారిటీ సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి మైనార్టీల అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షలు చేపట్టి వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను సరి చేసి , ప్రజా పాలనను తిరిగి గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 23వ తేదీన మైనార్టీ సంక్షేమం, శాఖల పై సీఎం సుధీర్ఘంగా సమీక్ష చేసి చేపట్టాల్సిన కార్యక్రమాలను అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారని అన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి విప్లవాత్మక దిశగా అభివృద్ధి కార్యాచరణకు సిద్ధం కావాలని సీఎం నిర్ణయించడం పట్ల ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.ముస్లిం మైనారిటీ వర్గాలకు అందే పథకాలను రీస్ట్రక్చర్ చేయాలని అధికారులను ఆదేశించడం పట్ల మైనార్టీల్లో ఆనందం వ్యక్తం అవుతుందని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద మంజూరైన రూ.447 కోట్లు కు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తెలుగు దేశం ప్రభుత్వంలో మంజూరై కొంత మేర నిర్మాణాలు జరిగిన షాదీకానాలు, ఇతర నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తామని, కడపలో తెలుగు దేశం ప్రభుత్వం రూ. 24 కోట్లు మంజూరు చేసి అందులో రూ.15 కోట్లు ఖర్చు చేసిందని,గుంటూరు క్రిస్టియన్ భవన్ కు నాడు తెలుగు దేశం ప్రభుత్వం రూ.16కోట్లు మంజూరు చేయగా 50 శాతం పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు భూముల సర్వే రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని, దూదేకుల నూర్ భాషా కార్పొరేషన్ ఏర్పాటు,ఇమామ్ లకు, మౌజన్ లకు నెలకు గౌరవ వేతన కింద రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామన్న హామీని త్వరల్లో అమలు చేసేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. మసీదుల నిర్వహణకు రూ. 5 వేలు ఆర్థిక సాయం, విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులకు రూ. 1 లక్ష సాయం, రూ 105 కోట్లతో నంద్యాల,గుంటూరు, అనంతపురం జిల్లా కేంద్రాలలో మైనారిటీ యువత ఎంపవర్మెంట్ కోసం మూడు సెంటర్స్ ఫర్ ఎక్సలెన్సీ నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటుతో మైనార్టీల సంక్షేమం విప్లవంలా ముందుకు సాగబోతున్నదని అన్నారు.కర్నూల్లో హైకోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు, అమరావతిలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ కళాశాల, జూనియర్ న్యాయవాదులకు రూ 10,000 గౌరవ వేతనం, నిందితులకు శిక్షపడేలా ప్రాసిక్యూషన్ పటిష్టత, జూనియర్ న్యాయవాదులకు శిక్షణ కేంద్రం కోసం అకాడమీ ఏర్పాటు అంశంపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని, న్యాయశాఖలో చేపట్టబోయే కార్యక్రమాలకు సీఎం ఆదేశాలతో ముందుకు సాగుతామని అన్నారు. మైనార్టీ సంక్షేమ న్యాయశాఖలో అమలు చేయబోయే విప్లమాత్మకమైన చర్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

# కల్తీ జరిగినట్టు నిరూపిస్తే పవన్ బూట్లు తుడుస్తా

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్24:
గత టీడీపీ ప్రభుత్వంలో ఆలయాలను కూల్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని పవన్‌ను ప్రశ్నించిన వైసీపీ సీనియర్ నేత
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు సవాలు విసిరారు. “తిరుమల లడ్డూ వ్యవహారంలో మేము తప్పు చేసినట్టు నిరూపించాలి. లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిన నెయ్యిని వాడినట్టు నిరూపిస్తే మీ బూట్లు నేను తుడుస్తా” అని సవాలు విసిరారు. ఎందుకీ డ్రామాలు ఆడుతున్నారని పవన్‌పై మండిపడ్డారు.
విజయవాడ ఇంద్రకీలాద్రి మెట్లను పవన్ శుద్ధి చేయడంపై స్పందిస్తూ… “మేము తప్పు చేస్తే మీరు మెట్లు తుడవడం ఏంటి?” అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.
హిందువుల దేవాలయాలపై దాడులు జరుగుతుంటే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదంటూ పవన్ అన్నారని, నిజానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడలో అనేక దేవాలయాలను పగలగొట్టారని అంబటి రాంబాబు ఆరోపించారు. దేవాలయాల్లోని దేవతామూర్తుల విగ్రహాలను మున్సిపాలిటీ బండ్లపై వేసుకెళ్లారని, సనాతన ధర్మం మీద ఇంత ప్రేమ, భక్తి ఉన్న పవన్ అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. “మా మీద రాజకీయంగా కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు… ఇది తప్పు కాదా? ఇది సాంప్రదాయమా? దీన్ని భగవంతుడు క్షమిస్తాడా?” అని అంబటి రాంబాబు ప్రశ్నించారు.

# ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

**ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష**

**న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశం**

**అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి పయనమైన మోదీ**

న్యూయార్క్: ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్24:
ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై, సాధారణ ప్రజల మరణాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ సాధ్యమైనంత త్వరగా యుద్ధం ముగిసిపోవాలని, శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై మూడు గంటలకుపైగా చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో సంక్షోభానికి త్వరగా తెరపడేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చక్కటి పరిష్కార మార్గం కోసం అంకితభావంతో ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ఉక్రెయిన్ విజ్ఞప్తితోనే మోదీ-జెలెన్స్కీ మధ్య ఈ సమావేశం జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. జెలెన్స్కీతో భేటీ అనంతరం మోదీ ‘ఎక్స్’లో పోస్టు చేశారు. భారత్-ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడమే లక్ష్యంగా గత నెలలో జరిగిన పర్యటనలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని వివరించారు.

ఉక్రెయిన్‌లో సంక్షోభానికి తెరపడి, శాంతి, స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని, అందుకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శాంతి కోసం దౌత్య మార్గాల్లో ప్రయత్నించాలన్నారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి చర్చలు జరగాలని సూచించారు. తమ దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్మేనియా ప్రధానితో భేటీ
ప్రధాని నరేంద్ర మోదీ న్యూయార్క్‌లో ఆర్మేని యా ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్‌తో భేటీ అయ్యారు. భారత్- ఆర్మేనియా మధ్య సంబంధాలపై చర్చించారు. నికోల్‌తో అద్భుతమైన చర్చ జరిగిందని మోదీ ‘ఎక్స్’లో పోస్టుచేశారు. అలాగే వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌ను సైతం మోదీ కలుసుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

సిక్కులతో మోదీ సమావేశం
ప్రధాని మోదీ న్యూయార్క్‌లో పలువురు సిక్కు పెద్దలతో సమావేశమయ్యారు. భారత్ లో సిక్కు సామాజిక వర్గం అభ్యున్నతికోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారంటూ మోదీకి సిక్కులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన



ప్రధానమంత్రి మోదీ మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం న్యూయార్క్ నుంచి భారత్‌కు తిరుగుపయనమయ్యారు.

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పాటించాలి: మోదీ
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండడం, పెద్ద సంఖ్యలో జనం మరణిస్తుండడం పట్ల ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన న్యూయార్క్‌లో పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌తో భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరపడాలని, అన్ని పక్షాలు తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని చెప్పారు. చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయాలని హమాస్‌కు మోదీ విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య శాంతికి చర్చలే మార్గమని పునరుద్ఘాటించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

బుధవారం 25 సెప్టెంబర్ 2024

# స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ఆంధ్రప్రగతి నంద్యాల టౌన్ సెప్టెంబర్ 24: స్కీమ్ వర్కర్లపై రాజకీయ నాయకుల వేదింపులు ఆపాలని సిపిఐ (యం యల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు. అనంతరం బండిఆత్మకూరు గ్రామానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, విఓఎలు (వెలుగు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులను పాలకపార్టీ నేతలు రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, కక్షలతో అక్రమంగా తొలగిస్తున్నారని వారు ఆరోపించారు. కొత్తవారిని నియమించి డబ్బులు దండుకోవాలన్న ఆలోచనలో కొందరు నాయకుల ప్రయత్నమని వారు విమర్శించారు. మా పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పటిదాక మీరు ఉద్యోగాలు చేశారు. ఇప్పుడు మా వాళ్ళు ఉద్యోగాలు చేస్తారు వంటి వాదనలు చేస్తున్న కొందరు నాయకులకు ఇవి



నామినేట్ చేసే రాజకీయ పదవులు కాదని వారు తెలియజేశారు. వీరికి సర్వీసు కండిషన్లు వున్నాయని, పని గంటలు, పని విధి విధానాలున్నాయని, నియామకపు పత్రాలున్నాయని వారు తెలిపారు. పార్టీలకు అధికారం శాశ్వతం కాదని, కానీ ప్రజలకు వివిధ సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం శాశ్వతం అని ఏ పార్టీ అధికారంలో వున్నా ఈ యంత్రాంగం ద్వారానే ప్రజాపాలన అందించాలని వారు తెలిపారు. అధికార పార్టీ నాయకులు చేసే వేధింపులు పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటంగా మారిందని అన్నారు. చిరుద్యోగులను బెదరించడం, బలవంతాన రాజీనామాలు చేయించడం లాంటి సంఘటనలతో కొందరు కార్మికులు ఆత్మహత్యలకు సిద్ధం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అరకొర వేతనాలతో బతుకీడుస్తున్న చిరుద్యోగులకు ఈ మాత్రం ఉపాధి కూడా పోతే జీవించడమే కష్టమవుతుందని అన్నారు. రాజకీయ వేధింపులు ఆపకుంటే పోరాటాలు చేస్తామని తెలిపారు. తప్పుడు పనులు చేస్తే గత ప్రభుత్వానికి వేసిన శిక్ష ఈ ప్రభుత్వానికి కూడా ప్రజలు అదే శిక్ష వేస్తారని తెలిపారు ఇకానైనా పై అధికారులు స్కీమ్ వర్కర్లపై రాజకీయ నాయకుల వేదింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నల్లమల ఘాట్ రోడ్డులో ఇటుక దిమ్మెలను ఢీకొన్న లారీ

**-డ్రైవర్ కు గాయాలు.. -రాకపోకలకు అంతరాయం**

ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 24: నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల్ల ఘాట్ రోడ్ లోని ఇటుకల దిమ్మలను లారీ ఢీకొంది. మంగళవారం తెల్లవారుజామున నంద్యాల నుండి గిద్దలూరు కు వెళ్తున్న ఉల్లిగడ్డ లోడు గల లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు గాయాలయ్యాయని, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గిద్దలూరు హైవే పోలీసులు తెలిపారు. దీంతో నంద్యాల గిద్దలూరు రాకపోకలు స్తంభించాయి.



# మహానంది మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 24: మహానంది మండలంలోని బసవాపురం మరియు గాజులపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలలో సమగ్ర సస్యరక్షణ మరియు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగినది . భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుట ద్వారా వ్యవసాయంలో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలియజేయడం జరిగినది.రైతులు మినుము వేసే ముందు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును ఐదు మిల్లీ లీటర్లు ఒక కిలో విత్తనానికి లేదా థయోమిథాక్సం అనే మందును ఐదు గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా మినిము పంటను 15 నుండి 20 రోజుల వరకు రసం పీల్చు పురుగుల భారి నుండి రక్షించుకోవచ్చు. మినుము పంటలో పల్లాకు తెగులు మరియు వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ఉండటానికి పంట తొలి దశలలో వేప నూనె ను పిచికారి చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. సింథటిక్ పైరి త్రాయిడ్ మందులు వాడరాదని తెలియజేయడం జరిగినది వరిలో పై పాటుగా భాస్వరం ఎరువులు వాడరాదని చెప్పడం జరిగినది. ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడ రాదని తెలియజేయడం జరిగినది. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని, తద్వారా మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలియజేయడం జరిగినది. వెటర్నరీ అధికారి రామలక్ష్మమ్మ పశువులకు వచ్చేవ్యాధులు వాటి నివారణ గురించి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రామలక్ష్మమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పల్లవి, షైనీ మరియు రైతులు పాల్గొన్నారు.




# వైసీపీ ని వీడి బైరెడ్డి సమక్షంలో టీడీపీ లో భారీ చేరికలు.

**-టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి. -మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 24: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఇది పేదల ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు.మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో పాణ్యం మండలంలోని మద్దూరు, గోనవరం, నేరవాడ, భూపనపాడు గ్రామాల ఎం పి టి సి లు, గ్రామ సర్పంచ్ లు వైసీపీ ని వీడి బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం అన్నారు. వైసీపీ ని వీడి టీడీపీ లో చేరిన వారికీ సముచిత స్థానం ఉంటుందని బైరెడ్డి భరోసా ఇచ్చారు.కె డి సి సి మాజీ డైరెక్టర్ వీరేంద్ర సింహారెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం మండలం మద్దూరు గ్రామ సర్పంచ్ గోపవరం ప్రదీప్ రెడ్డి, జి. భరత్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధు, సాకలి శివ, నాగరాజు,



నూర్ బాషా, అల్లాభకాష్, రాము, అక్బర్ బాషా తదితరులు. గోనవరం గ్రామ సర్పంచ్ రాజమ్మ, శేఖర్, తదితరులు, భూపనపాడు ఎంపిటిసి సుధారాణి, మనోహర్, తదితరులు నెరవాడ గ్రామ సర్పంచ్ లింగాల శారదమ్మ, శివారెడ్డి, ఎం. శేషారెడ్డి, రేస్మా, సుబ్బారాయుడు, ఫిరా ఊసేన్, రఫీ, పుష్పరాజ్, శేసిరెడ్డి, జ్యోతి స్వరూప రెడ్డి తదితరులు వైసీపీ ని వీడి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టీడీపీ లో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి బైరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం మద్దూరు గణపం పుల్లారెడ్డి, పాణ్యం పుల్లారెడ్డి, గోరుకల్లు ఎరుకలయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి, నంద్యాల టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లోనే మంచి ప్రభుత్వంగా ప్రజల మనసుల్లో ముద్ర

**-ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, అబ్జర్వర్ ఏవిఆర్ ప్రసాద్.**

ఆంధ్ర ప్రగతిప్రొద్దుటూరు సెప్టెంబర్ 24: సైకో జగన్ పాలనలో అతలాకుతలమైన జనం మంచి ప్రభుత్వం రావాలని కూటమి పార్టీలకు పట్టం కట్టారని, ఇది ప్రజలు కోరుకున్న పాలన అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్ వరదరాజుల రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏ వి ఆర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని 38,39,40,41వార్డులలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అధికారులతో కలసి ప్రజలకు వివరించారు. అనంతరం కూడలిలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి, పార్టీ పరిశీలకుడు ఏవిఆర్ ప్రసాద్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ




పథకాలు రాబోవు రోజుల్లో జరిగే అభివృద్ధి పనులను గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను నెరవేర్చంలో భాగంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మనసుల్లో ముద్ర పొందడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన సాగిస్తామని, ఐదేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సియం సురేష్ నాయుడు,మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి,వియస్ ముక్తియార్,పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి,ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనరు రఘునాథరెడ్డి,స్థానిక కౌన్సిలర్ రావలకొల్లు అరుణ,టౌన్ బ్యాంక్ చైర్మన్ సుబ్బారెడ్డి,మాజీ సర్పంచ్ మార్తల లక్ష్మిరెడ్డి, నాయకులు నల్లబోతుల నాగరాజు, బొర్రా రామాంజనేయులు,వద్దిబాలుడు,చౌడం వెంకటకొండయ్య,బోగా బాలవీరయ్య,సోమా బాలయ్య,గంజికుంట అంజి,చెంగా సిద్దయ్య,సిలివేరి శ్రీనివాసులు తెలుగుదేశం జనసేన, బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో స్వామీజీల నిరసన

**గత పాలకమండలినపై చర్యలకు డిమాండ్**




తిరుపతి, ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్24:తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై స్వామీజీలు నిరసన బాటపట్టారు. ఏపీ, తెలంగాణ సాధు పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట స్వామీజీలు ఆందోళనకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆలయాల్లో అన్యమతస్థులను ఉద్యోగులుగా నియమించవద్దని డిమాండ్ చేశారు. టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, అప్పటి ఈవోలు జవహర్ రెడ్డి, ధర్మారెడ్డి తరదితరులపై చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ తిరుమల.. సేవ్ టీటీడీ నినాదాలతో హోరెత్తించారు. వారితో టీటీడీ ఈఓ శ్యామలరావు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గత పాలకమండలిపై చర్యలు తీసుకోవాలని ఈఓకు వినతిపత్రం సమర్పించారు.

# బడుగులకు పెద్దపీట

## 20 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం




**ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్24:** 99 మందితో మొదటి నామినేటెడ్ పదవుల జాబితాను ప్రకటించిన కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎస్టీలకు పెద్ద పీట వేసింది. 11 మంది క్లస్టర్ ఇంఛార్జ్లకు పదవులు ఇచ్చింది. ఇందులో ఒక క్లస్టర్ ఇంఛార్జ్కు ఏకంగా ఛైర్మన్ పదవి దక్కడం గమనార్హం. అలాగే మరో ఆరుగురు యూనిట్ ఇంఛార్జ్లకు కూడా పదవులు దక్కాయి. ఇక తాజాగా ప్రకటించిన 99 పదవుల్లో యువతకు ప్రాధాన్యం దక్కింది. పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు సీఎం చంద్రబాబు పదవులు కట్టబెట్టారు.

**ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవాళ మొత్తం 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. అలాగే ఒక కార్పొరేషన్‌కు వైస్ ఛైర్మన్, వివిధ కార్పొరేషన్లకు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జనసేన నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరికి అవకాశం దక్కింది. ఇక ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడిని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్‌ను ప్రభుత్వం నియమించింది.**

**కార్పొరేషన్లు – చైర్మన్లు**

| | |
|---|---|
| వక్ఫ్ బోర్డు | అబ్దుల్ అజీజ్ |
| శాప్ అనిమిని | రవి నాయుడు |
| హౌసింగ్ బోర్డు | బత్తుల తాతయ్య బాబు |
| ట్రైకార్ | బురగం శ్రీనివాసులు |
| ఏపీ మారిటైం బోర్డు | దామచర్ల సత్య. |
| సీడ్ యాప్ | దీపక్ రెడ్డి |
| 20 సూత్రాల అమలు | లంకా దినకర్ (బీజేపీ) |
| ఏపీ మార్క్ ఫెడ్ | కర్రోతు బంగార్రాజు |
| విత్తనాభివృద్ధి సంస్థ | మన్నె సుబ్బారెడ్డి |
| ఏపీఐఐసీ | మంతెన రామరాజు |
| పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ | నందం అబద్దయ్య |
| ఏపీ టీడీసీ | నూకసాని బాలాజీ |
| ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ | కొనకళ్ల నారాయణ |
| ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ | పీఎస్ మునిరత్నం. |
| ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ | పీలా గోవింద్ |
| లిడ్ క్యాప్ | పిల్లి మాణిక్యాల రావు. |
| ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ | పీతల సుజాత |
| ఏపీఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ | శివ శంకర్ (జనసేన) |
| పౌరసరఫరాల కార్పోరేషన్ | సీతారామ్ సుధీర్ (జనసేన) |
| ఏపీ ట్రేడ్ ప్రమోషన్ | వజ్జా బాబురావు |
| ఏపీ టిడ్కో | అజేయ్ (జనసేన) |

# అనంతపురం జిల్లాలో రథం తగులబెట్టిన ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

**కనేకల్ మండలం హనకనహాళ్ గ్రామంలో ఘటన**
**వేకువజామున రథాన్ని తగులబెట్టిన దుండగులు**
**నిందితులను వదిలిపెట్టేది లేదన్న సీఎం చంద్రబాబు**
**జిల్లా కలెక్టర్, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు**



అనంతపురం ఆంధ్ర ప్రగతిసెప్టెంబర్24: కనేకల్ మండలం హనకనహాళ్ వద్ద రామాలయంలో రథాన్ని దుండగులు దగ్ధం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రథం దగ్ధం ఘటనను ఖండించిన ఆయన, ఇది మన సంస్కృతి, విలువలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఇలాంటి అపవిత్రమైన చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని, వారిని చట్టం ముందు నిలబెడతామని అన్నారు. రథం దగ్ధం ఘటనపై విచారణను స్వయంగా తానే పర్యవేక్షిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వీలైనంత త్వరగా నిందితులపై చర్యలు ఉండేలా చూస్తానని పేర్కొన్నారు.వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని చంద్రబాబు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులను ఆదేశించారు. వెంటనే దర్యాప్తు ఆరంభించి, రథం తగులబెట్టిన వారిని పట్టుకోవాలని నిర్దేశించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక





# సనాతన ధర్మంపై మాట్లాడితే సహించం

విజయవాడ ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్24:
సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘాటుగా హెచ్చరించారు.తప్పు జరిగిందంటే ప్రాయశ్చిత్తం చేసుకోండి.. లేకుంటే మౌనంగా ఉండాలంటూ వైసీపీ నాయకులకు చురకలంటించారు. సనాతన ధర్మంపై పోరాటం చేయగలిగితే నన్నెవరూ ఆపలేరన్నారు. ఈ నేల అన్ని మతాలను గౌరవిస్తుందని, ధర్మానికి విఘాతం కలిగినప్పుడు అందరూ మాట్లాడాలని చెప్పారు. తప్పు చేసిన వాళ్ల నాశనం మొదలైందని చెప్పారు. తిరుమల లడ్డూలో కల్తీ నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్.. విజయవాడ కనకదుర్గ ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో మెట్లను శుభ్రం చేశారు. ఆ తర్వాత మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మెట్ల పూజ చేశారు. అనంతరం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ దేశంలోని సగటు హిందువుకు వేరే మతం, వ్యక్తి మీద ద్వేషం ఉండదు. సనాతన ధర్మం పాటించే వ్యక్తులు ఇతర మతాలను గౌరవిస్తారు. వైసీపీ పాలనలో ఆలయాల్లో తప్పు జరిగిందని చెబితే అపహాస్యం చేసేవారు. హైందవ ధర్మాన్ని కాపాడతామని సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి బాధ్యత తీసుకు న్నారు. అపవిత్రం జరిగిందంటే బాధ్యత ఉన్న వ్యక్తులు సమాధానం చెప్పాలి. నాపై విమర్శలు కాదు.. అపవిత్రం జరిగిందని తెలిసినప్పుడు మీ బాధ్యతేంటి?. లడ్డూ ప్రసాదంలో అపవిత్రం జరిగిందంటే చాలా ఆవేదన కలుగుతోంది. సాటి హిందువులు.. తోటి హిందువులను దూషించడం మంచి పద్ధతి కాదు. బాధ్యత తీసుకున్న వాళ్లనే నేను నిందిస్తున్నా. ఇప్పటికీ వైసీపీ నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నిత అంశాలపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరం. తిరుమల లడ్డూపై ఆయన ఢిల్లీలో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌనం దాటి పొగరుగా మాట్లాడితే ఊరుకునేది లేదు. విమర్శించే వైసీపీ నాయకులకు చెబుతున్నా.. సనాతన ధర్మం జోలికి రావద్దు. తప్పు జరిగితే ఒప్పుకోండి. లేకపోతే సంబంధం లేదని చెప్పండి. అంతేగాని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టంగా చెబుతున్నా. పొన్నవోలు కూడా హిందువే.. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. అపవిత్రం జరిగినప్పుడు మాట్లాడితే తప్పా?. అని ప్రశ్నించారు. నటుడు ప్రకాశ్‌రాజ్‌కు కూడా చెబుతున్నా.. మీరంటే మాకు గౌరవం ఉంది. సున్నిత అంశాలపై విషయం తెలుసుకుని మాట్లాడాలి. సెక్యులరిజం అంటే సనాతన ధర్మానికి విఘాతం కలిగినా నోరు మూసుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఇస్లాం, క్రిష్టియన్ మతాల్లో ఇలాగే జరిగితే ఊరుకుంటారా..వారిని నోరుమూయించగలరా అన్నది ఆలోచించాలన్నారు. ప్రకాశ్‌రాజ్‌తో పాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు. తప్పు జరిగిందంటే ప్రాయశ్చిత్తం చేసుకోండి. లేకుంటే మౌనంగా ఉండండి. తప్పు చేసిన వాళ్ల నాశనం మొదలైంది. విచారణకు రావాలంటే సుబ్బారెడ్డికి రికార్డులు ఇవ్వాలట. మీరు ప్రభుత్వంలో ఉన్నప్పుడు మాకు రికార్డులు ఇచ్చారా?. ధర్మారెడ్డి ఎక్కడో కనిపించట్లేదు. తిరుమలను ఇష్టారాజ్యంగా మార్చేశారు. సనాతన ధర్మంపై పోరాటం చేయగలిగితే నన్నెవరూ ఆపలేరు. ఈ నేల అన్ని మతాలను గౌరవించేది. ధర్మానికి విఘాతం కలిగినప్పుడు అందరూ మాట్లాడాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు. సగటు హిందువుకు ఎలాంటి భయం, ఇతర మతాల పైన ద్వేషం ఉండదు. కనకదుర్గమ్మ రథం సింహాలు మాయమైతే వైసీపీ నేతలు అపహాస్యం చేశారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి మతం పుచ్చుకున్నారా లేదా నాకు తెలీదు. జగన్‌ను నేను ఎత్తి చూపడం లేదు... మీ సమయంలో జరిగిన అపచారంపై స్పందించాలని అన్నారు. సెక్యూలరిజం అన్ని వైపుల నుంచి రావాలన్నారు. సాటి హిందువు లు తోటి హిందువులను తిట్టడం ఆక్షేపణీయమన్నారు. మసీదులో చిన్న అపచారం జరిగితే ఇలాగే మాట్లాడతారా.. హిందువుల పట్ల ఎలా మాట్లాడతారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యులరిజం టూవే.. ఒన్ వే కాదు.. ప్రకాష్ రాజ్ అంటే గౌరవం ఉంది.. కానీ ఆయన సరిగా మాట్లాడాలి. సనాతన ధర్మంపై దాడి జరిగినప్పుడు మాట్లాడకూడదా. మేం చాలా బాధపడ్డాం.. మీకు ఇది ఇదంతా హాస్యం కావచ్చు. మాకు ఇదంతా చాలా బాధను కలిగించింది. ఇష్టానికి సనాతన ధర్మం పై మాట్లాడుతున్నారు. మీరు సరస్వతీ దేవి, దుర్గాదేవిలపై జోకులు వేస్తారా. సనాతనధర్మ రక్షణ అనేది గుడికెళ్ళే ప్రతీ హిందువు బాధ్యత కాదా. పొన్నవోలు మదమెక్కి మాట్లాడుతున్నారు. నా మీద కోర్టులో కేసులేసుకోండి.. సనాతన ధర్మం గురించి మాట్లాడితే రోడ్లమీదకు లాగుతాం' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ధర్మారెడ్డి హిందువా.. బిడ్డ చనిపోయిన పదకొండు రోజుల్లోపు గుడికి వచ్చేస్తారా. ఇస్లాం, ముస్లింలకు జరిగితే ఇలాగే ఉంటారా. సనాతన ధర్మం కోసం పోరాటం చేస్తే.. చనిపోవడానికి సిద్ధం నేను. మీ ప్రభుత్వాన్ని పడకొట్టిన మేము.. ఏమీ చేయలేం అనుకుంటున్నారా. మీ మౌనంతో తరాలు నాశనం అయిపోతాయి.. భారతదేశపు సినిమా అభిమానులు అందరూ హిందువులు కాదా. ఇస్లాం మీద గొంతెత్తితే రోడ్లమీదకు వచ్చి కొడతారని మీకు భయం.



## రాయలసీమ సాగునీటి రంగాన్ని
# సత్వరమే గాడిలో పెట్టండి

**రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి**

ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ సెప్టెంబర్ 24:
రాయలసీమ సాగునీటి రంగం శిథిలావస్థకు చేరింది. ఈ పరిస్థితిని అత్యంత ప్రాధాన్యతతో చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం నంద్యాల సమితి కార్యాలయంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఒక ప్రకటనను విడుదల చేసారు.
ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..
శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా, రాయలసీమ ప్రాజెక్టులకు నీరందడం లేదనే విషయాన్ని పౌర సమాజానికి తెలియజేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతను గుర్తు చేస్తూ రాయలసీమ సాగునీటి సాధన సమితి సెప్టెంబర్ 12న నంద్యాలలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రాజెక్టులను స్థితిగతులు స్వయంగా తెలుసుకొనే నేపథ్యంలో, ముందుగా హంద్రీనీవా ప్రాజెక్టు స్థితిగతులు తెలుసుకోవడానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాయలసీమ జిల్లాల పర్యటనకు విచ్చేసినందుకు వారికి అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు.
2014 - 19 లో టి డి పి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో రాయలసీమకు సాగునీటి రంగానికి 17 శాతం నిధులు ఖర్చు చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ నీవా ప్రాజెక్టు సందర్భంగా 22.9.2024 న ప్రకటించారు. 2019 - 24 లో వైసిపి ప్రభుత్వం కేవలం 6 శాతం నిధులను మాత్రమే రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేసారని ప్రకటించారు. వైసిపి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కంటే టిడిపి ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిధులు అధికంగా కేటాయించినప్పటికీ రాయలసీమ సాగునీటి రంగంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. అందుకు నాలుగు దశాబ్దాలుగా ప్రారంభమైన హంద్రీనీవా ప్రాజెక్టులో భాగమైన పందికోన రిజర్వాయర్ దుస్తితిని సవివరంగా వివరించారు. పందికోన రిజర్వాయర్ కు ప్రస్తుతం నీటిని నింపతున్న లెక్కన నిర్ధేశిత నీటిని నింపడానికి 464 రోజులు పడుతుంది. కానీ సంవత్సరంలో ఉన్నది 365 రోజులే. అంతే కాకుండా పంట కాలం కూడ 90 నుండి 120 రోజులు. ఈ వ్యవదిలో రిజర్వాయర్ కు నీరు అందించలేకపోతే వ్యవసాయం తిరోగమన దిశగా ఉంటుదని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టులో మొట్టమొదటిగా ఉన్న రిజర్వాయర్ పరిస్థితే ఇలా ఉంటే ప్రాజెక్టు చివరన ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం దుస్తితి గురించి వివరించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఎకరాకు నీళ్ళు ఇస్తాం.. ప్రజల దాహార్తిని తీరుస్తాం.. అనే వాగ్దానాలు రాయలసీమను రత్నాల సీమను చేయలేవు. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనకకు లాగా ఉన్న రాయలసీమ సాగునీటి రంగాన్ని తక్షణమే గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం ఉన్న రాయలసీమకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో 42 శాతం రాయలసీమకు కేటాయించి, రాయలసీమ సాగునీటి రంగంలో పురోగతిని సత్వరమే సాధించడానికి కృషి చెయ్యాలి. అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా రాయలసీమ సాగునీటి రంగం అభివృద్ధి చెందడానికి ఈ నిధులతో పాటుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన లేదా వేరే ఫథకాల ద్వారా మరియు స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా లేదా ప్రపంచ బ్యాంకు రుణాల ద్వారా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## జగన్ పాలనలో టీటీడీ ఆస్తుల దోపిడీపై
# సిబిఐ విచారణ చేయాలి

**-జగన్ పాలనలో టీటీడీలో అక్రమాలు జరగలేదని నమ్మితే పులివెందులలో రాజీనామా చేసి మళ్ళీ గెలువాలి.**
**-టీటీడీ బోర్డు చైర్మన్ పదవి ఆధ్యాత్మిక గురువులకే ఇవ్వాలి.**
**-టీటీడీ లడ్డు కల్తీ పై న్యాయవిచారణ జరిపించి ధోషులకు కఠిన శిక్ష వేయాలి.**
**-రాష్ట్రంలోని హిందూ ఆలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి.**
**-మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 24:
జగన్ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన ఆస్తుల దోపిడీ, అపవిత్రతపై సిబిఐ విచారణ చేయాలని, టీటీడీ లడ్డు కల్తీ పై న్యాయ విచారణ చేసి ధోషులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, జగన్ పాలనలో టీటీడీలో అక్రమాలు జరగలేదని జగన్ నమ్మితే పులివెందులలో రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికల్లో గెలువాలని, టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశిస్తే శ్రీ వేంకటేశ్వరస్వామి పటంతో పులివెందులలో జగన్ పై తాను పోటీకి సిద్ధం అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సవాల్ చేశారు.
మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సీనియర్ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు జగన్ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం అపవిత్రం, ఆస్తుల లూటీ, జరిగిందని, ఎంతో ఘన చరిత్ర, కీర్తి, ఆస్తులు, మహిమలున్న టీటీడీని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.నాస్తికులు, అన్యమతస్థుల పెత్తనంలో టీటీడీ విలవిలలాడిందని, ఆ వేంకటేశ్వరస్వామియే జగన్ పాలనకు విముక్తి కల్పించి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిందని, సీఎం చంద్రబాబు వెంటనే టీటీడీపై దృష్టి పెట్టి విచారణ చేయగా అనేక అక్రమాలు జరిగినట్లు గుర్తించారని, హిందువులు పవిత్రంగా భావించే ఏడుకొండల వెంకన్న లడ్డులో కూడా జగన్, ఆయన చుట్టూ ఉన్న అన్యమతస్థుల దోపిడీ గ్యాంగ్ లాలూచీ పడి కల్తీ కి పాల్పడడం క్షమించరాని నేరం అని బైరెడ్డి అన్నారు. ర్యాడికల్, నాస్తికుడు, మతం మార్చుకున్న భూమన కరుణాకర్ రెడ్డిని చైర్మన్ గా చేసి, టీటీడీ ఈఓ కు అర్హత లేని తన అనుకూల అధికారికి ఈఓ బాధ్యత అప్పగించి జగన్ టీటీడీలో యదేచ్ఛగా భక్తుల కానుకలు దోపిడీ చేశారని, అపవిత్రం చేశారని ఆయన ఆరోపించారు.
తిరుమలలో భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బైరెడ్డి ఎద్దేవా చేశారు. జగన్ తో పాటు వై వి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలు ముఠాగా ఏర్పడి ప్రత్యేక్షంగా, పరోక్షంగా టీటీడీ నిధులు దోపిడీ చేస్తూ, ఆలయ పవిత్రతను దెబ్బతీశారని బైరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలోని ఆలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించి, హిందువుల మనోభావాలు కాపాడాలని బైరెడ్డి కోరారు.
ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి, టీడీపీ నాయకులు నరహరి విశ్వనాధ్ రెడ్డి, పాండురంగయ్య, మద్దూరు సర్పంచ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, వీరేంద్ర సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# తిరుమల లడ్డూ కల్తీ నిజమే..

## బోర్డు గురించి జగన్ కు చెప్పినా వినలేదు.!

**మాజీ సీఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం.**

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 24:
తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందనే విషయాన్ని తాను పూర్తిగా నమ్ముతానని ఏపీ మాజీ సీఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. పక్కా ఆధారాలతో, ల్యాబ్ రిపోర్ట్ తో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత... అందులో నిజం ఎంత ఉందో అనే దానిపై సుదీర్ఘంగా చర్చించి నిర్ధారించుకోవడానికి ముఖ్యమంత్రికి కొంత సమయం పట్టి ఉంటుందని... అందుకే లడ్డూ కల్తీపై ఆయన ప్రకటన చేయడం కొంత ఆలస్యమై ఉంటుందని చెప్పారు. ఓ యూట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.
ఒక పవిత్రమైన హైందవ క్షేత్రంపై కుట్ర ప్రకారం ఏమైనా చేశారా? లేదా కొంత డబ్బును వెనకేసుకోవడానికి (అవినీతి) చేసిన ప్రయత్నమా? అనేది తనకు తెలియదని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. తాను సీఎస్ గా ఉన్న సమయంలో టీటీడీ బోర్డులోకి పెద్ద సంఖ్యలో సభ్యులను తీసుకున్నారని ఇది కరెక్ట్ కాదని సీఎం జగన్ కు చెప్పానని, ఆయన వినలేదని ఎల్వీ తెలిపారు. బోర్డు సభ్యులకు హిందూ ధర్మం గురించి తెలియదని, వారు వారి పనులతో బిజీగా ఉంటారని చెప్పారు. బోర్డు మీటింగులకు ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంటారని అన్నారు. బోర్డు సభ్యులు ఎక్కువైతే ఉపయోగం కంటే ఇబ్బందులే ఎక్కువని చెప్పారు. బోర్డు మీటింగులకు హాల్ సరిపోదని... పెద్ద ఆడిటోరియం కావాల్సి ఉంటుందని అన్నారు. ఈవో మెత్తగా ఉంటే... బోర్డు సభ్యులు ఒత్తిడికి గురి చేసి ఈవోను ఆటాడించే అవకాశం ఉందని చెప్పారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరిగిందని



అన్యమతానికి చెందిన పాంప్లెట్స్ కూడా దొరికాయని తెలిపారు. టీటీడీ ఉద్యోగుల్లో కొందరి పేర్లు రికార్డుల్లో హిందువులుగానే ఉంటాయని కానీ తర్వాతి రోజుల్లో వారు అన్యమతం స్వీకరించి ఉంటారని చెప్పారు. శ్రీశైలంలో కూడా తాను ఇలాంటివి చూశానని తెలిపారు. మతం మారిన వారికి హిందూ ధర్మంపై విశ్వాసం ఉండదని చెప్పారు. తిరుమల లడ్డూ అపవిత్రంపై తాను కూడా ప్రాయశ్చిత్తాన్ని పాటిస్తున్నానని ఎల్వీ చెప్పారు. జూబ్లీహిల్స్ లోని వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని జరిగిన తప్పుకు క్షమించాలని స్వామిని కోరుకున్నానని తెలిపారు.

